మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
గురువారం | 10 | ఆగస్టు | 2023 | పేజీలు : 6


## శ్రీదుర్గాభవానీ అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్



కరీంనగర్, ఆగస్టు 9 (మనం న్యూస్)ః కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీ దుర్గాభవానీ ఆలయంలోని అమ్మవారిని కలెక్టర్ డాక్టర్ బి.గోపి కుటుంబ సమేతం గా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు వంగల పవన్, అర్ష మల్లేశంలు కలెక్టర్ దంపతులను శాలువాలతో సత్కరించి, ఆలయ విశిష్టతను తెలియజేసారు.

# గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ

### దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దు

### జిల్లాకు మొదటి విడత 10వేల 500 మంజూరు




కరీంనగర్‌బ్యూరో,ఆగస్టు9( మనంన్యూస్): గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాన్ని అమలు చేస్తామని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు.కలెక్టర్ సమావేశమందిరంలో ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీ,అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ స్లాబ్ ఇల్లు ఉన్నవారు, జిఓ 59కింద లబ్దిపొందిన వారు ఈ పథకానికి అనర్హులన్నారు. గృహలక్ష్మి కోసం ప్రత్యేక దరఖాస్తు ఫారమ్ అంటూ ఏది లేదని,సోషల్ మీడియాలో వైరలవుతున్న ఫారమ్ తో ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. తెల్లకాగితం పై రాత పూర్వకంగా దరఖాస్తు రాసి ఆహార భద్రత కార్డు, అధార్ కార్డు,ఓటర్ ఐడికార్డుతో కలిపి తహసీల్దార్ కు అందిస్తే వారు కలెక్టర్ కు అందిస్తారని చెప్పారు. గ్రామ కంఠంలో ఉన్న పాత ఇల్లు కాని, స్థలాలకు కానీ దస్తావేజు పేపర్లు ఉండవు కాబట్టి ఇంటి నంబర్ అయినా సరే లేకుంటే ఖాళీ స్థలం ఉన్నా సరే దరఖాస్తు చేసుకోవచ్చుని తెలిపారు. పట్టణ ప్రాంతాలకు చెందిన దరఖాస్తు దారులు మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గృహలక్ష్మి పథకం అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక నోడల్ ఆఫీసర్ ప్రతి మండలానికి ఒక స్పెషల్ వెరిఫికేషన్ అధికారిని నియమించామని చెప్పారు. 3 లక్షల రూపాయలను మూడు విడతలుగా అందిస్తామని అందులో బెస్ మెంట్ పూర్తికాగానే మొదటి విడతగా లక్ష రూపాయలు, రూఫ్ పూర్తి కాగానే 2వ విడతగా మరో లక్ష రూపాయలు,నిర్మాణం పూర్తి అయిన తర్వాత 3వ విడతలో చివరి లక్ష రూపాయలు అందిస్తామన్నారు. గృహలక్ష్మి లబ్దిదారులు ఇలాగే ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. గృహలక్ష్మి పథకం కింద ఈ నెల 10వ తేదీవరకు దరఖాస్తులు స్వీకరించి 20వ తేదీలోగా లబ్దిదారుల వెరిఫికేషన్ పూర్తిచేస్తామన్నారు. 25వ తేదీన మొదటి విడత లబ్దిదారులకు అందిస్తామని చెప్పారు. లబ్దిదారుల్లో ఎస్సీలు 20 శాతం, ఎస్టీలు 10 శాతం, బీసీలు 50 శాతం, వికలాంగులు 5 శాతం మించకుండా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. గృహలక్ష్మి పథకం మహిళ పేరుతో అందజేయడం జరుగుతుందని స్థలం మహిళ పేరుతో ఉండాల్సిన అవసరం లేదన్నారు. పథకం కోసం మహిళ పేరిట నూతన బ్యాంకు అకౌంట్ తీయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గృహలక్ష్మి పథకం కింద మొదటి విడతగా కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 10 వేల 5 వందలు మంజూరు అయ్యాయని ఇందులో కరీంనగర్ నియోజకవర్గానికి 3 వేల మందికి, చొప్పదండి నియోజకవర్గానికి 1650 మంది, మనకొండుర్ నియోజకవర్గానికి 2వేల మంది, హుజూరాబాద్ కు 2600 మంది, హుస్నాబాద్ నియోజకవర్గంలోని కరీంనగర్ జిల్లా పరిధిలో మండలాలకు 1250 మంది లబ్దిదారులకు అందించనున్నామని తెలిపారు.బీసీ కులవృత్తుల చేయూత పథకం చెక్కుల ఈ నెల 15వ తేదీలోగానే పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైనార్టీ బంధు విధివిధానాలు త్వరితగతిన ఖరారు చేసి మరో రెండు రోజుల్లో ప్రకటిస్తామని చెప్పారు. 2వ విడత దళిత బంధు కింద నియోజకవర్గానికి 11 వందల యూనిట్లను మంజూరు చేస్తున్నామని మొదటి విడుతలో పెండింగ్ లో ఉన్న యూనిట్లను పూర్తిస్థాయి గ్రౌండింగ్ చేసేందుకు అధికారులు యుద్దప్రతిపాదికన చర్యలు తీసుకోవాలన్నారు. గొర్రెల పథకం మొదటి విడుతలో మంజూరు అయిన వారికి యూనిట్లు త్వరగా అందించాలని సూచించారు.. 2వ విడతగా జిల్లాకు 10 వేల 236 యూనిట్లను కెటాయించారని దీనికి సంబంధించిన లబ్ధిదారుల జాబితాను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ వై సునీల్ రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, మానకొండూర్ చొప్పదండి మరియు హుస్నాబాద్ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ సుంకె రవిశంకర్, సంతోష్ కుమార్ లు, జిల్లా కలెక్టర్ డాః బి. గోపి, అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్, డిసిసి చైర్మన్ కొడూరి రవీందర్, సుడా చైర్మన్ జి.వి. రామకృష్ణా రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనీల్ గౌడ్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటి చైర్మన్ రెడ్డవేణి మదు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గోన్నారు.

## రెండు పడక గదుల గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



పెద్దపల్లి, ఆగష్టు09(మనం ప్రతినిధి): రెండు పడక గదుల గృహ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ కాంట్రాక్టర్‌లను సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోనితన చాంబర్‌లో బుధవారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌లతో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్లాబ్,గోడలు, ప్లాస్టింగ్, ఫ్లోరింగ్ స్థాయి నుండి లబ్దిదారులకు ఇబ్బందులు రాకుండా ఇళ్లలో సౌకర్యాలు కల్పించి అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉండే విధంగా పనులుపూర్తి చేయాలని, లబ్దిదారులకు కేటాయింపు చేయవలసి ఉన్నందున వెంటనే మిగిలిన పనులు పూర్తి చేయాలని, కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లింపులు చేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈసమావేశంలో రెండుపడక గదుల నోడల్ అధికారి, ఈ.ఈ.పిఆర్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌లు పాల్గొన్నారు.

## బిటెక్ కోర్సుతో ప్రవేశానికి చివరి అవకాశం




2 లో

## 170 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



రామగిరి,ఆగస్టు 09 మనం న్యూస్ : రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు (స్కూల్ యూనిఫామ్‌లు) పంపిణీ జరిగింది. ఎంఈఓ పల్లెపాటి సంపత్‌రావు,సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు,ఎంపీటీసీ ధర్మల రాజసంపత్‌లు వీటిని అందజేసారు.విద్యార్థులు అందరూ ఒకే రకమైన దుస్తులు వేసుకోవాలని సీఎం కేసీఆర్ మంచి ఆలోచన విధానమే ఈ యూనిఫామ్‌లను అందజేయడం అని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు, ఎంపీటీసీ ధర్మల రాజసంపత్ అన్నారు. 170 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున 340 డ్రెస్‌లు అందజేయడం జరిగిందని హెచ్.ఎం వేగోళపు సదానందం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ నగునూరి శ్రీనివాస్,మెంబర్ పీవీరావు,ఉపాధ్యాయులు కనకం స్వామి,అటికం మురళి,మూల మంజుల,సలాకుల తిరుపతి,కళ్యాణం,సుజాత,శ్రీకాంత్,సదానంద చారి పాల్గొన్నారు.

## ఉపయోగకరంగా రూమ్ టూ రీడ్



రామగిరి,ఆగస్టు 09 మనం న్యూస్ : రూమ్ టు రీడ్ స్వచంద సంస్థ చేస్తున్న కార్యక్రమం చాలా బాగుందనీ రామగిరి ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు,సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు,ఎంపీటీసీ ధర్మల రాజ సంపత్ అన్నారు. బుధవారం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకటి, రెండు,మూడవ తరగతి విద్యార్థులకు క్యాలెండర్‌లను, పాఠ్య పుస్తకలను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం వేగోలపు సదానందం,విద్యా కమిటీ చైర్మన్ నగునూరి శ్రీనివాస్,మెంబర్ పీవీరావు,కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్,ఉపాధ్యాయులు కనకం స్వామి,అటికం మురళి,మూల మంజుల,సలాకుల తిరుపతి,కళ్యాణం సుజాత,శ్రీకాంత్,సదానందంచారి పాల్గొన్నారు.

## 4గురు తహాశీల్దార్‌లకు పోస్టింగ్.. ముగ్గురికి స్థానచలనం..

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, ఆగష్టు 09(మనం ప్రతినిధి): జిల్లాకు కేటాయించిన 4గురు తహాశీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ, అలాగే జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు తహాశీల్దార్‌లను పరిపాలన దృష్టిలో ఉంచుకొని బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి వచ్చిన బి.మధుసూధన్ రెడ్డికి సుల్తానాబాద్ తహాశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రజితను ధర్మారం తహాశీల్దార్‌గా బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లా నుంచి వచ్చిన వి.మోహన్‌రెడ్డి కమాన్‌పూర్ తహాశీల్దార్‌గా, బి.రామచందర్‌కు రామగిరి తహాశీల్దార్‌గా పనిచేస్తున్న ఎం వాసంతిని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయ పరిపాలన అధికారిగా బదిలీ చేశారు. హన్మకొండ జిల్లా నుండి వచ్చిన బి.రాజేశ్వరీని ముత్తారం మంథని తహాశీల్దార్‌గా నియమించి, ధర్మారం తహాశీల్దార్‌గా నియమించిన జాహేద్ ఫాషాను శ్రీరాంపూర్ తహాశీల్దార్‌గా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# బిటెక్ కోర్సుతో ప్రవేశానికి చివరి అవకాశం




రామగిరి,ఆగస్టు 03 మనం న్యూస్ : సింగరేణి అధికారుల,ఉద్యోగుల పిల్లలకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మంథని లో బిటెక్ కోర్సులలో ప్రవేశానికి మిగిలిన సూపర్ న్యూమరి సీట్స్ కోసం రెండవ,చివరి దశ కౌన్సిలింగ్ కొరకు దరఖాస్తులు కోరడమైనదని ఆర్జీ-3 జీఎం ఎన్.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ అధికారుల పిల్లలకు 14,ఉద్యోగుల పిల్లలకు 12 సీట్లు ఈ క్రింద తెలిపిన వివిధ విభాగాలలో మిగిలి ఉన్నాయని తెలిపారు. కోర్స్ అధికారుల పిల్లలకు - ఉద్యోగుల పిల్లలకు మైనింగ్ ఇంజనీరింగ్ 3-3, సివిల్ ఇంజనీరింగ్ 3-3 మెకానికల్ ఇంజనీరింగ్ 3-3 ఎలక్ట్రికల్ అండ్ ఎలెక్ట్రోనిక్ ఇంజనీరింగ్ 3-3,కంప్యూటర్ సైన్స 1-0,కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 1-0,మొత్తం 14-12,ఇట్టి కౌన్సిలింగ్ పాల్గొనే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు,కుల ధ్రువీకరణ పత్రం,స్థానికం/నాన్- లోకల్ సర్టిపికెట్,2023 లో తెలంగాణ రాష్ట్రము నిర్వహించిన ఎంసెట్ ర్యాంక్ కార్డు,ఉద్యోగి ఐడి కార్డు(ఒరిజినల్)తో తేది 14.08.2023 సోమవారం నాడు జెఎన్‌టియు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్,మంథని ప్రాంగణంలో నిర్వమించబడే కౌన్సిలింగ్‌కు ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలని,కౌన్సిలింగ్ లో ఎంపికైన అభ్యర్థులు ప్రవేశ రుసుము బ్యాంకు ద్వారా చెల్లించి సీట్‌ను కేటాయించుకోగలరని తెలియజేశారు.



## ప్రమాదవశాత్తు గాయపడిన వ్యక్తికి జనసేన పార్టీ చెక్కు అందజేత

సుల్తానాబాద్,ఆగస్టు 09 మనం న్యూస్ : గర్రెపల్లి గ్రామానికి చెందిన పులి పవన్‌కు ఇటీవల బైకు యాక్సిడెంట్ లోప్రమాదవశాత్తు గాయపడగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు,తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాజలింగం సూచనల మేరకు పెద్దపల్లి నియోజకవర్గ క్రియాశీలక వాలంటరీ రాసూరి హరికృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన క్రియాశీల జనసైనికుడు పులి వపన్‌కు యాభై వేల రూపాయల చెక్కు అందజేయడం జరిగింది. ఇట్టి చెక్కును ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల నియోజకవర్గం ఇన్చార్జి బెక్కం జనార్ధన్,హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి తగరపు శ్రీనివాస్,మంథని నియోజకవర్గ ఇన్చార్జి మాయ రమేష్,ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు రాజిరెడ్డి,చల్ల శివారెడ్డి,కాసరాజు,పడాల ప్రసాద్,చిట్టి ఉదయ్ కుమార్, సంఘభట్ల వినయ్‌ల చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి నియోజకవర్గం జనసేన నాయకులు లొల్లిశివ,ఈర్ల అజయ్,పెర్క నీరజ్ ,వడ్లకొండ శ్రీకాంత్,పున్న సతీష్,జెట్టి సాగర్,జెట్టి శ్రీకాంత్,దాడి అనిల్,వినయ్,సాయి,తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు



పెద్దపల్లి, ఆగష్టు 09(మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లాకు నూతనంగా వచ్చిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్‌లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీలను మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ పాధ్యక్షులు చింత కుంట విజయరమణారావు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మక్కాన్‌సింగ్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పెద్దపల్లి జిల్లా సమస్యలపై పలు విషయాలను మాట్లాడారు. వారి వెంట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## జెఎన్టీయు యూనివర్శిటీలో పెద్ద ఎత్తున మేరీ మట్టి మేరా దేశ్ హరిత హారం కార్యక్రమం




రామగిరి,ఆగస్టు 09 మనం న్యూస్ : జెఎన్టియు హైదరాబాద్ యూనివర్శిటీ ఆదేశాల మేరకు మేరీ మట్టి..మేరా దేశ్ (నా నేల .. నా దేశం) కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం మంథని జెఎన్టియూ ఇంటనీరింగ్ కళాశాలలో పెద్ద ఎత్తున హరిత హారం కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్స్పల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి మార్గ నిర్దేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్ దుర్గారావ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాధికారి,ఫారెస్ట్ రేంజ్ అధికారి నాగయ్య,పన్నూరు గ్రామపంచాయతీ సర్పంచ్ అల్లం పద్మ తిరుపతి ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ముందుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ఆవరణలో ప్లకార్డులు,బ్యానర్లు పట్టుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెండు వేలకు పైగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణం,ప్రకృతిపై మమకారం పెంచుకోవాలని సూచించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పెద్ద ఎత్తున మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏమరైట్ ప్రొఫెసర్ జగన్నాథజెట్టి,సమన్వయకర్తలు సదానందం,తిరుపతి,శ్రీధర్,రవివర్మ,సుమతి,హిరణ్మయి,పెద్ద సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఫోన్ ట్రేస్ చేసి సదరు వ్యక్తికి ఫోన్ అప్పగించిన ఎస్సై మహేందర్



పెద్దపల్లి, ఆగష్టు 09(మనం ప్రతినిధి): అత్యాధునిక టెక్నాలజీ సీఈఏఆర్ (సెంట్రల్ ఏక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సదరు వ్యక్తికి పెద్దపల్లి ఎస్సై మహేందర్‌యాదవ్ బుధవారం అప్పగించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీ ద్వారా ఫోన్ ఎక్కడైనా పోగొట్టుకున్న లేదా చోరికి గురైనా ఆఫోన్‌లను వెతికి పట్టుకోవడానికి ఎంతో చేయూతనిస్తుందని తెలిపారు. మొబైల్ ఫోన్ పోతే తక్షణమే సంబధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా సెకండ్ హ్యాండ్ ఫోన్‌లు కొనే ముందు అప్లికేషన్‌లో ఫోన్ యొక్క వివరాలను (ఐఎంఇఐ)నంబర్‌తో చేసి చెక్ చేసుకోవాలని, ఆఫోన్ యొక్క స్టేటస్ తెలుస్తుందని అన్నారు. పెద్దపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్‌కాలనీకి చెందిన బండోజు కృష్ణమాచారి గత నెలలో పెద్దపల్లి కమాన్ సమీపంలో ఫోన్ పోగోట్టుకోవడంతో పెద్దపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో నూతన టెక్నాలజీని ఉపయోగించి ఆమొబైల్ పట్టణంలోని బండారికుంటలో ఉన్నదని గుర్తించి పోలీసులు ఫోన్‌ని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తికి అప్పగించామని పెద్దపల్లి ఎస్సై మహేందర్ యాదవ్ తెలిపారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేదాజ్ఞలు కొనసాగింపు

## కరీంనగర్ సిపి సుబ్బరాయుడు



కరీంనగర్ క్రైం, ఆగస్టు 9 (మనం న్యూస్): సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ ఎల్.సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో, రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుండటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిందని, మద్యంప్రియుల ఆగడాలకు కళ్ళెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పరిస్థితుల ప్రభావం నేపథ్యంలో ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఐపిసి 188 హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

**: డిజెలపై నిషేధాజ్ఞలు పొడిగింపు:**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 31వ తేదీ వరకు పొడగిస్తున్నట్లు సుబ్బరాయుడు తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్లతో కూడిన డిజె సౌండ్ వినియోగంపై నిషేదాజ్ఞలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ ల వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఎసిపిల అనుమతి పొందాలని సూచించారు. ఏ ఏ ప్రాంతాల్లో ఏమేరకు మైక్ సెట్లు వినియోగించాలో పరిమితులున్నాయని పేర్కొన్నారు. కమీషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు డిజెల వినియోగంపై యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందని, పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించే అవకాశముందని తెలిపారు. నిషేదాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసుచట్టం, ఫసలి నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సిపి హెచ్చరించారు.

## స్కాంలకు కేరాఫ్‌గా నగర పాలక సంస్థ

### - హోర్డింగ్ స్కీంను కూడా వదలడం లేదు

### - ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జోజిరెడ్డి



కరీంనగర్, ఆగస్టు 9 (మనం న్యూస్): స్కాంలకు కేరాఫ్ అడ్రసుగా కరీంనగర్ నగర పాలక సంస్థ నిలుస్తోందని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి ఆరోపించారు. నగర పాలక సంస్థ సిబ్బంది నగరంలో ఏర్పాటు చేస్తోన్న హోర్డింగ్‌లను కూడా విడిచిపెట్టకుండా అవినీతికి పాల్పడుతున్నారన్నారు. నగరంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ కరీంనగర్ స్మార్ట్ సిటీ హోదా పొందాక పైసలపైనే దృష్టి పెట్టారని, సామాన్య, మధ్యతరగతి బుద్ధిజీవుల్లా కనిపించినవాళ్లు సైతం ఇప్పుడు 11 ఏసీలతో, మూడు నాల్గు ఫ్లోర్లతో ఇళ్లను నిర్మించుకుంటూ ఆ ఎదుగదలను చూసిన అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. స్మార్ట్ సిటీ అయ్యాక రోడ్ల నుంచి మొదలు కుంటే ఎలక్ట్రిసిటీ బల్బులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కంపును కూడా వీడకుండా స్కామ్స్ జరుగుతున్నాయని నిత్యం ఏదో ఒక ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయన్నారు. యాడ్స్ నుంచి షెటర్స్ వరకూ ఏదైనా అయినవాళ్లకు కట్టబెట్టడం, కానివాళ్లను పక్కనబెట్టడం నోటు వెయిట్ చూసి వారికి అనుమతివ్వడం కరీంనగర్ బల్దియాలో పరిపాటిగా మారిందని ఆరోపించారు. ప్రధాన రోడ్లపై ఉండే బిల్డింగ్స్ పై వాహనదారుల దృష్టి మరల్చేలా పెడుతున్న హోర్డింగ్స్, బ్యానర్స్, ఫ్లెక్సీలపై ప్రభుత్వం నిషేధం విధించినా నగరంలో మాత్రం ఎలాంటి నిబంధనలు అమలు కావడం లేదని జోజిరెడ్డి పేర్కొన్నారు. అడ్వర్టైజ్ మెంట్స్ కు సంబంధించి క్యాంటీలివర్స్, యునీపోల్స్, హోర్డింగ్స్ ఏర్పాటులో అనేక అవకతవకలున్నట్టు ఆరోపించారు. హోర్డింగ్ ఏర్పాటు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంబంధిత నిబంధనలను పక్కనబెట్టి నగరంలోని అనేక ప్రాంతాల్లో హోర్డింగ్‌లను ప్రమాదకరంగా ఏర్పాటు చేశారన్నారు. నిబంధనల ప్రకారం విద్యుత్ అధికారులు, ట్రాఫిక్ పోలీస్ విభాగాల నుంచి అనుమతులు తీసుకోకుండానే హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తోన్న విషయంలో అసలు మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు.



## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

చిగురుమామిడి, ఆగస్టు 9 (మనం న్యూస్): యువజన కాంగ్రెస్ 63వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు రెడ్డి యాదగిరి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ యువజన కాంగ్రెస్‌ను ఏర్పాటు చేసిన ఇందిరాగాంధీ యువ జనులను ఏకం చేశారన్నారు. ప్రస్తుతం నాలుగు కోట్ల మంది యూత్ కాంగ్రెస్ సభ్యులున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించేలా ప్రతి ఒక్క యువజన కాంగ్రెస్ కార్యకర్తల కంకణబద్ధులై ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యువతను కెసిఆర్ మభ్య పెడుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అందించని, కెసిఆర్‌కు అంతిమ గడియలు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రశాంత్ గట్టు, జిల్లా నాయకులు చిట్టుమల్ల రవీందర్, ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి,దాసరి ప్రవీణ్,మండల మీడియా సెల్ అధ్యక్షుడు బోయిని వేణు,మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ సింగ్, ఎస్కే షాబుద్దీన్,కాంతాల మహిపాల్ రెడ్డి, కవ్వంపెల్లీ సంజీవ్,కోనేటి రాములు,పోలు శ్రీనివాస్, గ్రామ శాఖ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గోటే రఘుబాబు, గూడ సతీష్,నవీన్,రామ్,అరవింద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి గంగులను మళ్లీ గెలిపించుకుంటాం

### యాదాద్రిలో బద్దిపల్లి గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మాణం



కొత్తపల్లి, ఆగస్టు 9 (మనం న్యూస్): బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్‌ను నాలుగవ సారి మళ్లీ గెలిపించుకుంటామని పేర్కొంటూ కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం పవిత్ర పుణ్యక్షేత్రం యాదాద్రికి వెళ్లిన బద్దిపల్లి గ్రామస్థులు, రైతులు గంగుల కమలాకర్‌కు మరోసారి ఘన విజయం అందిస్తామని లక్ష్మీనరసింహస్వామి సమక్షంలో ప్రమాణం చేశారు. బద్దిపల్లి గ్రామంలోని ఓట్లన్ని మా కమలాకర్‌కే వేస్తామని తీర్మాణం చేశారు. ప్రస్తుతం బద్దిపల్లి గ్రామస్థులు చేసిన ప్రమాణానికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## 'గృహలక్ష్మి' కోసం భారీగా దరఖాస్తులు



ఇల్లందకుంట, ఆగస్టు 9 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న గృహలక్ష్మి పథకం కోసం మండలంలోని అనేక మంది బుధవారం దరఖాస్తులు చేసుకున్నారు. ఇల్లందకుంట మండలంలోని 18 గ్రామపంచాయితీల పరిధిలోని నిరుపేదలు గృహలక్ష్మి పథకం కింద ఇంటి నిర్మాణం కోసం లబ్ధిపొందేందుకు దరఖాస్తులు సమర్పించేందుకు ఎంపిడివో కార్యాలయం వద్ద బారులు తీరారు. ఈ సందర్భంగా ఒకే బుధవారం రోజున 521 మంది దరఖాస్తులు సమర్పించినట్లు జూనియర్ అసిస్టెంట్ కిరణ్ తెలిపారు. అయితే దరఖాస్తులు సమర్పించిన వారికి ఎలాంటి నంబరు కేటాయించడం లేదని, దరఖాస్తు గడువును పొడిగించాలని పలువురు పేర్కొంటున్నారు. పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చే ఈ పథకాన్ని కేవలం కొన్ని రోజులకే పరిమితం చేయకుండా నిరంతర ప్రక్రియగా సాగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



కరీంనగర్, ఆగస్టు 9 (మనం న్యూస్): నగరంలోని ఫతేపూర చౌరస్తాలో అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ రహమాన్, ఉపాధ్యక్షులు కలీం ఆధ్వర్యంలో బుధవారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి కార్యదర్శి వైద్యులు అంజన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి శానిటేషన్ కార్మికులను సత్కరించారు. విశిష్ట అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు మేనేని రోహిత్ రావు మాజీ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ ఇమ్రాన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మోసిన్, నాయకులు హజి, ఇమ్రాన్, మహమ్మద్ అమీర్, సిరిపురం నాగరాజు, షాహిద్, అజీజ్, శేఖర్, వాజిడ్, వంశీ ,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా



కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 9 (మనం న్యూస్)ః నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని నిరసిస్తూ కార్మిక,కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రెండు రోజుల పాటు చేపట్టనున్న మహా ధర్నా కార్యక్రమాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల జిల్లా నాయకులు బుచ్చన్న యాదవ్, గీట్ల ముకుంద రెడ్డి, టేకుమల్ల సమ్మయ్య, ఎడ్ల రమేష్, జిందం ప్రసాద్, ఊకంటి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ అనేక త్యాగాలు రక్తతర్పణతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడులుగా మారుస్తూ పార్లమెంటులో బిజెపి చట్టం చేసిందన్నారు. వేతనాల కోడ్ చట్టంతో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి మంగళం పాడిందని తెలిపారు. అదే విధంగా పారిశ్రామిక సంబంధాల కోడ్ చట్టంతో సమ్మె హక్కును కాలరాస్తోందని ఆరోపించారు. సామాజిక భద్రత కోడ్, వృత్తి సంబంధిత రక్షణ, ఆరోగ్యం పని పరిస్థితుల్లో కోడులతో పిఎఫ్, ఈఎస్ఐ వెల్ఫేర్ బోర్డులపై గొడ్డలి వేటు వేస్తూ, తిరిగి 12 గంటల పని విధానం అమలులోకి తెచ్చే కుట్రలను పన్నుతోందన్నారు. హైదరాబాదులో కేంద్రీకృతమై ఉన్న బీడీఎల్, బిహెచ్ఇఎల్, హెచ్ఎఎల్, మిధాని లాంటి సంస్థలలో సుమారు 25 నుండి 50 శాతం దాకా వాటాలను అమ్మేసిన ఘనత మోడీ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. కార్మికులు, పేద మధ్యతరగతిలో అత్యధికులు పాలసీదారులుగా ఉన్న ఎల్ఐసిలో లక్షల కోట్ల రూపాయల వాటాలను అమ్మేందుకు తెగబడి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలను నిరాటంకంగా కొనసాగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపడుతోన్న మహా పడవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండ రాజిరెడ్డి, వర్ణ వెంకట్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్, రాయికంటి శ్రీనివాస్, వివిధ సంఘాల నాయకులు కొప్పుల శంకర్, జనగాం రాజమల్లు, శ్రీనివాస్,గుడికందుల సత్యం, కదిరే రమేశ్, పిట్టల సమ్మయ్య, రజిత, అరుణ, అంకుస్, గట్టు రాజన్న, విలసాగర్ అంజయ్య, పొన్నం కనకయ్య, శీలం అశోక్, గుండేటి వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్యాధికారి




చిగురుమామిడి, ఆగస్టు 9 (మనం న్యూస్)ః మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి జి.జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థుల యొక్క అడ్మిషన్స్ రిజిస్టర్‌తో పాటు హాజరు పట్టికను పరిశీలించారు. పదోన్నతి పొంది మొట్టమొదటిసారిగా కళాశాలకు విచ్చేసిన ఆయనను కళాశాల సిబ్బంది శాలువాతో సత్కరించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ఉచిత పుస్తకాలను విశాలమైన తరగతి గదులను విద్యార్థుల సద్వినియోగం చేసుకుంటూ విద్యాభ్యాసాన్ని చక్కగా సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ ఇల్లందుల సంపత్ కుమార్, జనార్ధన్ గోవర్ధన్ రెడ్డి, రవి, మహేందర్, లైబ్రేరియన్ శ్రీనివాస్, కృష్ణమోహన్, మమత, అనిత, స్వరూప రాణి, కవిత, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్రన్, జూనియర్ అసిస్టెంట్ అమర జ్యోతి, ఆఫీస్ సబార్డినేట్ తిరుపతి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా క్రీడారంగాభివృద్ధిపై 'దేబబ్రత' ముద్ర

### - చెరువును స్టేడియంగా మార్చిన ఘనుడు

### - ఆయన మృతికి సంతాపం వెలిబుచ్చిన క్రీడాసంఘాల బాధ్యులు



కరీంనగర్, ఆగస్టు 9 (మనం న్యూస్)ః దివంగత కరీంనగర్ జిల్లా మాజీ కలెక్టర్ దేబబ్రతకంఠకు క్రీడలు, క్రీడాకారులన్నా ప్రత్యేకమైన అభిమానం ఉండేది. 1998 నుండి 2001 వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కలెక్టర్ గా తనదైన శైలిలో పాలనను కొనసాగిస్తూ ప్రత్యేక ముద్రను పొందారు. దేబబ్రత కంఠ ఆకస్మిక మరణంతో జిల్లా క్రీడారంగం బాధ్యులు ఆయన జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆయన మృతిపట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ బాధ్యులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, నాగిరెడ్డి సిద్ధారెడ్డి, మహ్మద్ కరీం, గన్ను విజయభాస్కరరెడ్డి లు తమ సంతాపం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లా క్రీడారంగాభివృద్ధి గురించి ఆయన చేసిన కృషిని తలుచుకున్నారు. అన్ని శాఖలతో పాటు క్రీడారంగాభివృద్ధిపై ఆయన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నాటి కరీంనగర్ జిల్లా క్రీడలభివృద్ధి అధికారి ముక్కాముల సుబ్బారావు విజ్ఞప్తి , శాట్స్ రిటైర్డ్ ఎడి నాగిరెడ్డి, సిద్ధారెడ్డిల ప్రణాళికల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా అప్పటి వరకు చెరువులా ఉన్న అంబేద్కర్ స్టేడియం భూమి, చుట్టు పక్కన ఉన్న ప్రైవేట్ వ్యక్తులతో ఆక్రమణకు గురైంది. ఈ తరుణంలో వాస్తవంగా స్టేడియానికి కేటాయించబడిన భూమి వివరాలను సంబంధిత రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు. నాటి డిఐజి వివేక్ దూబే చొరవతో ఎన్టీపీసీ సహకారంతో 24 ఎకరాల్లో పెద్ద ఎత్తున మట్టిని నింపించి సమాంతర పరిచారు. దేబబ్రత కంఠ ప్రత్యేక చొరవతో స్టేడియం లో దాదాపు 5 ఫీట్లు లోతుతో అథ్లెటిక్స్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్టులు నిర్మించారు. పర్యవసనంగా రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కరీంనగర్ కు 2000లో అథ్లెటిక్స్, సైక్లింగ్ అకాడమీ కేటాయించింది. సైక్లింగ్ వెలోడ్రమ్ నిర్మాణ కోసమై మానేర్ డ్యాం చెంతన 10 ఎకరాల భూమిని కేటాయించారు. నేడు ఈ స్థలంలో ప్రాంతీయ క్రీడా పాఠశాల కొనసాగుతోంది. అంబేద్కర్ స్టేడియం చుట్టూ నాలుగు ప్రధాన గేట్లను ఏర్పాటు చేస్తూ, చుట్టూ ప్రహరీ గోడను నిర్మింప చేశారు. స్టేడియం ప్రధాన ద్వారంను దార్శనికతతో రెడ్ స్టోన్ తో ప్రత్యేక హంగులను అదేవిధంగా ఫౌంటెన్ నిర్మాణాన్ని స్వయంగా కలెక్టర్ అక్కడే అర్ధరాత్రి వరకు కూర్చొని నిర్మాణ పనులు పర్యవేక్షించడం ఆయన నిబద్ధతకు నిదర్శనం. ఆయన చొరవతోనే ఎంపీ నిధులతో స్టేడియంలో గ్యాలరీలు నిర్మించడం విశేషం. ఆయన హయాంలోనే జగిత్యాల, హుజురాబాద్ మినీ స్టేడియాల నిర్మాణాలకు అనుమతులు ఇస్తూ, నిధులను విడుదల చేయించారు. 1998లో రామగుండం ఎన్టీపీసీలో జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ మరియు హాకీ పోటీలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. 1998 అక్టోబర్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి గ్రామీణ క్రీడల్లో భాగంగా హాకీ, రెజ్లింగ్, కబడ్డీ క్రీడలను హుజురాబాద్ హై స్కూల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నయా పైసా నిధులను విడుదల చేయనప్పటికీ కలెక్టర్ అందుబాటులో తన వద్ద ఉన్న నిధులతో విజయవంతంగా ఈ పోటీలను నిర్వహించి సర్వత్ర మన్ననలు పొందారు. ఈ పోటీల నిర్వహణ సందర్భంగా హుజురాబాద్‌లో ప్రధాన రహదారులను యుద్ధ ప్రాతిపదికన నిర్మించడంతోపాటు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. పలు క్రీడల నిర్వహణ సందర్భంగా అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులను ఆయన భాగస్వామ్యం చేశారు.



## ఉద్యోగాలను పర్మినెంటు చేయాలి

### టిఎన్జీవోల నాయకులకు బాలల పరిరక్షణ యూనిట్ కాంట్రాక్టు ఉద్యోగుల వినతి

కరీంనగర్, ఆగస్టు 9 (మనం న్యూస్)ః తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసేలా కృషి చేయాలని కోరుతూ జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ కాంట్రాక్టు ఉద్యోగులు బుశారం టిఎన్జీవోల అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్ రెడ్డి వెనువెంటనే రాష్ట్ర కార్యవర్గానికి నివేదిస్తూ ఉద్యోగుల పేస్కేలు , రెగ్యులరైజేషన్ తదితర డిమాండ్ల పై వెంటనే సిఫార్సు చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్జీవోల సంఘం కార్యదర్శి లక్ష్మణరావు, గౌరవా. ధ్యక్షులు రాగి శ్రీనివాస్, పట్టణాధ్యక్షులు హర్మిందర్ సింగ్, కార్యవర్గ సభ్యులు డి.రాధిక, నాయకులు కె.క్రిష్టోఫర్, యం. కవితాదేవి, డిసిపియు యూనియన్ నాయకులు రాజు, రాజ్ కుమార్, రమేష్, స్వప్న, పురుషోత్తం , పాల్గొన్నారు.

## శ్రీమతి స్వప్నకి డాక్టరేట్



రామగిరి,ఆగస్టు 09 మనం న్యూస్ ః పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రామయ్యపల్లి గ్రామానికి చెందిన ఏకైక మహిళ వృక్షశాస్త్ర అధ్యాపకురాలు స్వప్నకి హర్యాన రాష్ట్రంలోని నీల్మ్ విశ్వవిద్యాలయం పిహెచ్‌డి పట్టా ప్రధానం చేసినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుతం స్వప్న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పాలెం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. స్వప్న ఏఎన్ ఎత్నోబోటనికల్ స్టడీ ఆన్ మెడికల్ ప్లాంట్ యూజ్ అమొంగ్గి పీపుల్ ఆఫ్ మధ్యప్రదేశ్ పై చేసిన పరిశోధనం గాను డాక్టరేట్ పట్టాను పొందారు. స్వప్న డాక్టర్ నిర్మల్ శర్మ(గైడ్) దిశా నిర్దేశంలో ఈ పరిశోధనను కొనసాగించారు. స్వప్నకి డాక్టరేట్ రావడం పట్ల కళాశాల అధ్యాపక బృందం,విద్యార్థుల హర్షం వ్యక్తం చేశారు.

## వసంత్ వ్యాలీ లో విశ్వ విష్ణు సహస్రనామ స్తోత్రం



కరీంనగర్,ఆగస్టు9 (మనం న్యూస్ ): నగరంలోని వసంత్ వ్యాలీ పాఠశాలలో బుధవారం విశ్వవిష్ణు సహస్రనామ సంస్థాన్ ఆధ్వర్యంలో విశ్వవిష్ణు సహస్రనామ స్తోత్రం ను విద్యార్థులు ,ఉపాధ్యాయులచే అనిపించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏ స్వరూప బుచ్చిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో భక్తి ని పెంపొందించేందుకు ఏకాగ్రతతో విశ్వ విష్ణు పఠనం ఎంతో దోహదపడుతుందని ద్వారా భక్తితో పాటు ప్రతి ఒక్కరిలో ఏకాగ్రత ముందుచూపు మనశ్శాంతి మనసులో ఉల్లాసం కలిగి ప్రతిభావంతులుగా తయారవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ విష్ణు సహస్రనామ సభ్యులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



మెట్ పల్లి, ఆగస్టు 9 (మనం న్యూస్)ః రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు 50 శాతం కమిషన్ పెంచడాన్ని హర్షిస్తూ బుధవారం పట్టణంలోని చౌకధరల దుకాణాల నిర్వాహకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నిర్మల మహేశ్వర్ మాట్లాడుతూ తమ కష్టాలను అర్థం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం కమిషన్ పెంచి డీలర్ల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కోటా శంకర్, పొట్ట రాజేశ్వర్, ముల్కల కిషన్, అజార్, విజయలక్ష్మి, దేవేందర్, బత్తుల నరేష్, కైలాసపతి, లక్ష్మీ ,శంకర్, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# మేము తప్పుచేస్తే ఏ శిక్షకైనా సిద్ధం

**ఆమూడు గ్రామాలలో మాకు భూములు లేవు..**

**ఒకభూమి ముగ్గురికి రిజిస్ట్రేషన్ చేస్తే**

**ఒక్కొక్కరికి మూడింతలు చెల్లిస్తాం**

**లేదంటే తప్పుడు సమాచారం ఇచ్చిన**

**వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి**

**మావోనేత వెంకటేష్‌కు విజ్ఞప్తి**

**కట్టా నరేంద్రచారి, కంది చొక్కారెడ్డి**

పెద్దపల్లి, ఆగస్టు 09(మనం ప్రతినిధి): మావోయిస్టు పార్టీ నాలుగు జిల్లాల కార్యదర్శి వెంకటేష్ ఇచ్చిన ప్రకటన కేవలం పార్టీకి కొందరు అందించిన తప్పుడు సమాచార లోపంతో వచ్చిన వార్త మమ్మల్ని ఎంతగానో బాధకు గురిచేసిందని సీనియర్ జర్నలిస్టు కట్టా నరేంద్రచారి, కంది చొక్కారెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మేమంటే గిట్టని వాళ్లు ఇచ్చిన అబద్దపు సమాచారాన్ని విశ్వసనీయతలోకి తీసుకొని ప్రకటన ఇవ్వడం వలన మాకుటుంబాలు ఆవేదనకు గురయ్యాయని అన్నారు. వాస్తవానికి మీరు పేర్కొన్న గౌరెడ్డిపేట, బొంపల్లి, కాసులపల్లి గ్రామాలలో మా ఇద్దరికి గజం జాగా లేదు. అయిన భూములు ఉన్నట్టు ఎవరైనా చెబితే మేం సిద్ధం.. ఆయా గ్రామాల్లో మీరుగాని, మీదగ్గర వారుగాని వెళ్లినప్పుడు మాగురించి ఆరా తీసి మీ దగ్గర వ్యక్తుల ద్వారా మమ్ములను ఆదేశిస్తే, ఆగ్రామాలలోని భూములను ఆఊరి పేదలకు మేమే సొంత ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేయించి భూములను ఇచ్చేస్తాం. ఇక దేవాదాయ శాఖ భూములు మాఆధీనంలో ఉంటే ఆభూములను తిరిగి దేవాదాయశాఖకు అప్పగిస్తామన్నారు. ఇక రెండవది ఇద్దరికి ముగ్గురికి చొప్పున తప్పుడు రిజిస్ట్రేషన్ చేపిస్తే, ఆవ్యక్తులను మాదగ్గరకు పంపించండి. ఇది పూర్తిగా ఆబద్ధం, అంత అమాయకులు కూడా ఎవరూ లేరు. అయినా వాళ్లను మీదగ్గర వ్యక్తులను ఇచ్చి బాధితులను మాదగ్గరికి పంపించండి వాళ్లు చెల్లించిన డబ్బులకు నాలుగింతలు వాపస్ ఇస్తామని, ఇవి కేవలం పగతో చేసిన ఆరోపణలు మాత్రమేనని అన్నారు. మేము పెద్దపల్లి పట్టణానికి చెందిన ముస్లీం వ్యక్తి వద్ద స్థలం కొనుగోలు చేయలేదు. కొమిరిశెట్టి కనకయ్య, తూముల నంబారావు, సంతు, రవిల వద్ద 20గుంటల భూమి 9మందిమి కలిసి 13 ఏళ్ల క్రితం కొనుగోలు చేసి విక్రయించాము. తర్వాత ఐదారెళ్లకు సంబంధించిన భూమి ఇప్పుడు కోర్టు పరిధిలో ఉంది. ఈకేసు అనంతరం బాధితులకు మీరు ఆదేశించినట్లు ఎవరు ఎంత డబ్బు వాడుకున్నారో, వారికి తిరిగి చెల్లించడానికి సిద్దంగా ఉన్నామని తెలిపారు. ఈవ్యవహారంలో మేము ఇద్దరం కాదు 14మంది బాధ్యులం. అందులో మావాట చేరో ఏడు శాతం వాటాదారులం మాత్రమే. ఈభూమి వ్యవహారంలో పూర్తిగా సత్యమైన సమాచారం. వర్గ చైతన్యంలేని వ్యక్తులు





ఇచ్చే సమాచారం ఆధారంగా మాపై హెచ్చరిక చేయడం చాలా బాధ కలిగించింది. అలాంటి వారి తప్పుడు సమాచారం వలన పార్టీ పట్ల, మాలాంటి దిగువ తరగతిప్రజలలో ఒక రకమైన అభిప్రాయం ఏర్పడుతుంది. 33ఏళ్లుగావర్కింగ్ జర్నలిస్టుగా కొనసాగుతున్న తనను మాజీ విలేకరి అంటూ సంబోధించడం మరింత బాధేసింది. నాజర్నలిస్టు జీవిత కాలమంతా, మీపార్టీ ఎంతగానో ప్రేమించే గ్రామీణ ప్రాంత,పీడిత తాడిత ప్రజల కష్టాలను రాశాను. నావార్త కథనాలను బహుశా మీరు చూడలేదని అనిపిస్తోంది. అలాంటి నన్ను మాజీ విలేకరిగా బోధించడం ఏమంత బాగాలేదు. ఇవికాకుండా ఇంకా ఇతర తప్పులు ఏమి చేసినా ఇంకా ఏడాది కాలం పట్టిన సరే విచారించాలని కోరారు. ప్రజల మధ్యకు పిలిచి శిక్షించండి. లేదంటే ఇలాంటి తప్పుడు సమాచారం ఇచ్చిన మీ నమ్మకస్తులపై, మున్ముందు మావోయిస్టు పార్టీకి నష్టం జరగకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్నలిస్టు కట్టా నరేంద్రచారి, కంది చొక్కారెడ్డిలు కోరారు.


మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

మంచిర్యాల జిల్లా: మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, హాజీపూర్, లక్సెట్టిపేట్, దండెపల్లి, జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, కన్నెపల్లి, నెన్నెల్, భీమిని, తాండూర్, కాసిపేట,

ఆసిఫాబాద్ జిల్లా: కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాలా, చింతలమానెపెల్లి, పెంచికలపేట్, బెజ్జూరు, దహేగాం, రెబ్బెన, వాంకిడి, జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు), తిర్యాని.
మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

నిర్మల్ జిల్లా: నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

ఆదిలాబాద్ జిల్లా: అదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నం:
సెల్ : 96666 99086, 83339 98076

# నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకుంటే విరివిగా అవకాశాలు



**- ప్రభుత్వ ప్రోత్సాహాన్ని యువత అందిపుచ్చుకోవాలి**

**: మంత్రి కెటిఆర్**

**- ఐటి హబ్, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించిన కెటిఆర్**

నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 9 (మనం న్యూస్):నైపుణాభివృద్ధిని పెంపొందించుకుంటే అన్ని రంగాల్లో విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఐటి, పురపాలక శాఖా మంత్రి కె.తారకరామారావు అన్నారు. ఈ దిశగా యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొనసాగిస్తోన్న అనేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపుని చ్చారు. బుధవారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. జిల్లా కేంద్రంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలో నూతనంగా నిర్మించిన ఐటి హబ్ ను ఆయన అట్టహాసపు ఏర్పాట్ల నడుమ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జాతీయ ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయ భవనాన్ని, దుబ్బ, వర్ని రోడ్డు, అర్సపల్లి ప్రాంతాల్లో నిర్మించిన వైకుంఠధామాలను, నగరపాలక సంస్థ నూతన భవనంతో పాటు ఖిల్లా రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్ లకు ప్రారంభోత్సవాలు జరిపారు. మున్సిపల్ కార్మికులతో కలిసి శ్రీ రామ గార్డెన్ లో సహపంక్తి భోజనం చేశారు. ఐ.టీ హబ్ ను ప్రారంభించిన సందర్భంగా, అన్ని విభాగాలను సందర్శిస్తూ వసతి, సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. కొత్తగా ఐ.టీ కొలువుల్లో చేరిన ఉద్యోగులతో, బాసర ట్రిపుల్ ఐ.టీ విద్యార్థులతో మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. వారిని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, ఐ.టీ రంగంలో తెలంగాణ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందని, అనేక అంతర్జాతీయ సంస్థలు తమ కంపెనీలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. నూతన ఆవిష్కరణలతో ముందుకు వచ్చే వారికి ఈ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని సూచించారు. యువత ప్రభుత్వ తోడ్పాటును అందిపుచ్చుకుని సరికొత్త ఆవిష్కరణలతో ప్రత్యేక గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. నూతన ఆవిష్కరణల దిశగా ప్రయత్నాలు చేస్తున్న వారిని ప్రభుత్వం తప్పనిసరిగా ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు. పలువురు విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను మంత్రి కేటీఆర్ పరిశీలించి, వాటి పనితీరు గురించి ఎంతో ఆసక్తితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఐ.టీ హబ్ లో వివిధ కంపెనీలలో కొత్తగా ఉద్యోగాల్లో నియామకమైన వారికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కేటీఆర్, ఇది ఆరంభం మాత్రమేనని మునుముందు మరెంతోమందికి ఐ.టీ హబ్ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

### : కెటిఆర్‌కు ఘన స్వాగతం:

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన తారకరామారావుకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా ఉదయం 11 . 45 గంటలకు మంత్రి కేటీఆర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు కే.ఆర్.సురేష్ రెడ్డిలు మంత్రి కేటీఆర్ తో కలిసి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో వచ్చారు. హెలిప్యాడ్ వద్ద జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీలు రాజేశ్వర్ రావు, వి.గంగాధర్ గౌడ్, రాష్ట్ర మహిళా సహకార సంస్థ చైర్ పర్సన్ ఆకుల లలిత, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, మేయర్ దండు నీతూకిరణ్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మార్క్ ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మోహన్ తదితరులు కేటీఆర్ ను కలిసి పూల మొక్కలు, బొకేలు అందించి ఘన స్వాగతం పలికారు. కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ మంత్రి కేటీఆర్ పర్యటన కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఐటి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, వివిధ శాఖల రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# కోమన్ పల్లి గ్రామంలో రెండు కులాలను బహిష్కరించిన విడిసి

ఆర్మూర్, అక్టోబర్ 9 (మనం న్యూస్): ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల కురుమ, నాయక పోడు కుటుంబాలను గ్రామ విడిసి సాంఘిక కుల బహిష్కరణ చేయడంతో అవస్థలకు గురవుతున్నారు. బాధిత కుల సంఘాల కుటుంబాలు తెలిపిన వివరాల ప్రకారం.. కోమన్ పల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల ప్రక్కన సుబ్బిర్యాల్ గ్రామానికి చెందిన ఎమ్ ఎన్ గంగారెడ్డికి సుమారు 8 ఎకరాల 23 గుంటల స్థలం ఉంది కాగా కెనాల్ పక్కన నుండి మరో 30 గుంటల స్థలం కూడా అతనికి సంబంధించినదే. 20 సంవత్సరాల క్రితమే కొనుగోలు చేసిన భూమిని ఆ వ్యక్తి ఇటీవల 30 గుంటల స్థలానికి రెవెన్యూ సర్వే చేపట్టి పంచనామా చేస్తే సంబంధిత భూమికి పంచులుగా కోమన్‌పల్లి గ్రామానికి చెందిన గుజ్జ అశోక్ యాదవ్, నిమ్మ పోషెట్టి (నాయక పోడు) సంతకాలను పెట్టారు. వీరిద్దరే కాకుండా సుబ్బిర్యాల్ గ్రామస్తులు ఎనిమిది మంది కూడా పంచులుగా సంతకాలు పెట్టారు. కోమన్ పల్లి గ్రామస్తులు ఇద్దరు సంతకాలు పెట్టడం వల్లే 30 గుంటల స్థలం గంగారెడ్డికి దక్కిందని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఇరువురి పై ఆరోపణలు చేశారు. రెండు రోజుల పాటు సమయం కావాలని బాధితులు అడిగిన అవేమీ పట్టించుకోకుండా లక్ష ఆరువేల రూపాయలు ఖర్చయిందని చెప్పి డబ్బులు ఇరువురు చెల్లించాలని హుకుం జారీ చేశారు. ఆర్మూర్ తాసిల్దార్, ఆర్ ఐ, ఏడి అధికారులు చెప్పారని,పంచులుగా సంతకం పెట్టినందుకే జరిమానా విధిస్తున్నట్లు చెప్పారు. జరిమానాగా విధించిన డబ్బులు చెల్లించాలని విడిసి డిమాండ్ చేశారు. ఈ నెల 7వ తేదీన సంబంధిత విషయమై ఆర్మూర్ సీఐ కి ఫిర్యాదు చేయగా 8వ తేదీన సీఐ వచ్చి ఇరు వర్గాలతో చర్చలు జరిపించి వెళ్లారు. గ్రామ విడీసీని కాదని పోలీసులను ఎందుకు పిలిపించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అదే రోజు నుండి గొల్ల కురుమ 28 కుటుంబాలు, నాయకపోడు



22 కుటుంబాలను సాంఘిక కుల బహిష్కరణ చేశారంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కుల సంఘాల కుటుంబాలను సాంఘిక బహిష్కరణకు గురి చేస్తూ నిత్యవసర సరుకులు, హోటల్లో టీ టిఫిన్, ఫిల్టర్ వాటర్, డిష్ టీవీ కనెక్షన్, ఆర్ఎంపి వైద్యుడి సేవలు, బీడీ కార్మికులకు ఆకులు, బీడీలను తీసుకోవడం లేదని వారు వాపోయారు. చివరకు బర్రెలు, గొర్రెలను కూడా మందలో కలువనియడం లేదని చెప్పారు. రెండు కుల సంఘాల కుటుంబాలను దుర్భషలాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సర్వేకి పంచులుగా ఉండి సంతకాలు పెట్టడమే మా తప్ప అంటూ ప్రశ్నించారు.రెండు కుల సంఘాల సమస్యను పరిష్కరించి సంబంధిత అధికారులు, పోలీసులు సరైన న్యాయం చేయాలని వారు తెలిపారు.

# నిజామాబాద్

## ప్రతి గ్రామంలో వెయ్యి మొక్కలు నాటాలి



బోధన్, ఆగస్టు 9 (మనం న్యూస్): ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీలోగా ప్రతీ గ్రామంలో వెయ్యి మొక్కలు నాటాలని డిఆర్డిఎ పిడి చందర్ అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతి కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిడివో పర్బన్న, ఎంపిఒ మధుకర్, ఇంచార్జీ ఎపిఓ ఆల్తాఫ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



ఆర్మూర్, ఆగస్టు 9 (మనం న్యూస్ ): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ అధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 220 మంది గ్రామస్తులు, 600 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫౌండేషన్ డైరక్టర్ సుచరిత రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కండ్ల కలక వ్యాధి ఒకరి నుండి మరొకరికి సంక్రమించడం, మొబైల్ ఫోన్స్ ఎక్కువ ఉపయోగించడం వల్ల కంటి చూపు పై తీవ్ర ప్రభావముంటుందన్నారు. మానవుడికి అతి ముఖ్యమైన సున్నితమైన అవయం కన్ను అని, ఏ చిన్న ఇబ్బంది అయిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. కంటికి సంబంధించిన చికిత్స కోసం నాటు వైద్యాన్ని ఆశ్రయించడం వల్ల కంటి చూపు కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. కంటి సమస్యలు, వాటికి తగిన చికిత్స, సూచనలు చేసేందుకే మొదట తన స్వగ్రామంలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం వివిధ దశల్లో అన్ని గ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి, ఫౌండేషన్ అధ్వర్యంలో ఉచితంగా పరీక్షించి ,అవసరం మేరకు మందులు, కంటి అద్దాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ చైర్మన్ గోపి కృష్ణ, సురేష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి



ఆర్మూర్ రూరల్, ఆగస్టు 9 (మనం న్యూస్): ఆర్మూర్ మండలం పెర్కిట్ మహిళా ప్రాంగణంలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తోన్న ఆకుల రాజు (30) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. తెలంగాణ ఫంక్షన్ హాల్ వెనుక వైపున్న మామిడి తోటలోని గుడిసెలో అనుమానాస్పద స్థితిలో పడి చనిపోయి కనిపించాడు. మృతుని భార్య ఆకుల లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాల్కొండ ఎస్సై గోపి తెలిపారు.